కలుషిత రంగునీటిని అరికట్టాలి

రేపు పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మహాధర్నా

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : కలుషిత రసాయన రంగునీటికి వ్యతిరేకంగా నగరి పర్యావరణ పరిరక్షణ సేవాసమితి, లయన్స్ క్లబ్, వాకర్స్ అసోసియేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, ఏఐఎంజెఎఫ్ జస్టిస్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం మహా ధర్నా నిర్వహించనున్నారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. విషపూరిత రసాన రంగునీరు కాలువలలోకి రాకూడదని, డైయింగ్ యూనిట్లన్నీ త్వరగా ఊరి బయటకు తరలించాలి..' అనే అంశంపై పోరాడనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

సమరానికి సై..!

- సంక్రాంతి బరిలో పందెం కోళ్లు
- పోలీసుల నిఘా ఏదీ?

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సంక్రాంతి వచ్చిందంటే సంప్రదాయ వంటకాలు, బంధువులు, స్నేహితులతో కళకళాడే గ్రామాలు పేకాట, కోడిపందేలు గుర్తుకొస్తాయి. రాయలసీమ ప్రాంతా ల్లోనూ కోడి పందేలు జోరుగా సాగుతాయి. ముఖ్యంగా సంక్రాంతి పేకాట, కోడిపందేలు, జల్లికట్టు వంటివి చాటు మాటుగా సాగిపోతుంటాయి. రాజకీయ నేతల కనుసన్నల్లో నడిచే ఈ చాటుమాటు కార్యక్రమాలను అధికార యంత్రాగం చూసీచూడనట్లుగా వ్యవహ రిస్తుంటారు. ఈ ఏడాది సంక్రాంతి బరిలో దింపేందుకు జిల్లాలో పెద్ద సంఖ్యలో పందెం కోళ్లను సిద్ధం చేశారు. ఏటా సంక్రాంతి రోజున పేకాట, కోడి పందేల్లో కోట్ల రూపాయలు చేతులు మారు తుంటాయి.

సంక్రాంతి దగ్గర పడుతున్న కొద్దీ పోలీసులకు జిల్లాలో కోడిపందేలు, పేకాట రాయుళ్లను ఎలా అదుపుచేయాలనే కసరత్తు మొదలెట్టారు. జిల్లాలో గతంలో నమోదైన కోడిపందేలు, పేకాట కేసులను నమోదు అయిన ప్రాంతాలను గుర్తించి ఆ గ్రామా లపై ప్రత్యేక నిఘా పెట్టారు. సంక్రాంతిని పురస్క రించుకొని పేకాట, కోడింపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరికలు జారీ చేశారు. పేకాట, కోడిపందేల శిబిరాలు నిర్వహించే వ్యక్తులకు కౌన్సెలింగ్ ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని యాదమరి, బంగారుపాళ్యం, వ్రాతలవట్టు, ఐరాల, తవణంపల్లి, జీడి నెల్లూరు, కార్వేటినగరం, నగరి, పుత్తూరు ప్రాంతాల్లో కోడిపందేలు, పేకాట కేసులను పోలీసులు నమోదు చేశారు. చంద్రగిరి ప్రాంతంలో ప్రత్యేకంగా జల్లికట్టు నిర్వహిస్తున్నారు.

సంక్రాంతికి సర్వ సాధారణమే

సంక్రాంతి అంటే కోడిపందేలు, పేకాట, జల్లి కట్టు సర్వ సాధారణంగా మారి పో యింది. స్థానిక రాజకీ య పేదల అండ దండ లతో అలా సాగి పోతుండ టంతో పోలీ సు లకు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిం ది. సరదాసరదగా సాగి పోయే పేకాట, కోడిపందేలు, జల్లికట్టు కాస్త రాజకీయ వైరాలను సృష్టిం చడంతో పాటు అమాయక ప్రజల ప్రాణాలను బలి గొంటు న్నాయి. దాడులు, ప్రమాదాల్లో గాయ పడుతున్నారు. జల్లి కట్టు సమయాల్లో జనంపై పశువులు దాడి చేసి గాయపరచిన ఘటన లున్నాయి. మద్యం మత్తులో కొడిపందేలు, పేకాట శిబిరాల వద్ద వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులకు దిగిన ఘటనలు జిల్లాలో అనేకం.. సంప్రదాయ ముసుగు లో జనంపై పశువులు దాడి చేసి గాయపరిచిన ఘటనలున్నాయి. మద్యం మత్తులో కొడిపందేలు, పేకాట శిబిరాల వద్ద వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులకు దిగిన ఘటనలు జిల్లాలో అనేకం చోటుచేసుకున్నాయి. సంప్రదాయ ముసుగులో సాగిపోతున్న అనుమతులు లేని కోడిపందేలు, పేకాట, జల్లికట్టుపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి ప్రశాంత వాతారవణంలో సంక్రాంతి సంబరాలు జరుపుకొనేలా గ్రామీణ ప్రాంతాల్లో పోలీసులు నిఘాపెంచాలి. గుట్టుచప్పుడు కాకుండా చాటు మాటుగా చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటారో ప్రజలకు తెలపాల్సిన బాధ్యత అధికార యంత్రాగం, రెవెన్యూ, పోలీసులు కల్పించాల్సిన అవసరం వుంది. సంక్రాంతికి వారం రోజులు ముందే గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహణ కోసం ఏర్పాటు చేసే శిబిరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి.. ఏటా పోలీసులు సంక్రాంతి సంప్రదాయం పేరిట చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నా జిల్లాలో పేకాట, కోడిపందేలు, జల్లికట్టు జోరు తగ్గడంలేదు. ఈ ఏడాదైనా రెవెన్యూ, పోలీసుశాఖలు సమ న్వయంతో సంప్రదాయ ముసుగులో సాగుతున్న పేకాట, కోడిపందేలు, జల్లికట్టు వంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలను అరికట్టి ప్రజలు సుఖ సంతోషాలతో సంక్రాంతిని జరుపుకొనేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కనురెప్పే కాటేస్తే..

కీచక తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: కన్న కూతురిని కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి కీచకుడై అత్యాచారానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. అతనిపై నాన్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక పోలీసుల కథనం మేరకు..మండలంలోని పెద్దకాపల్లి పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన రెడ్డెప్ప కుమారుడు పెద్దప్ప, అతని మొదటి భార్య కుమార్తె (12) గురువారం సాయంత్రం పెనుగొలకల నుండి చికెన్ తీసుకొని వస్తుండగా మార్గమధ్యంలో ఆ బాలికను చేయి పట్టుకొని పెద్దబండపైకి లాక్కుని వెళుతుండగా పెద్దప్ప తల్లి పార్వతమ్మ అడ్డుకుంది. పార్వతమ్మను చేతులతో కొట్టి, కాళ్లతో తన్ని తన కుమార్తెను లాక్కొని చెట్లలోకి వెళ్లాడు. పార్వతమ్మ అరుచుకుంటూ సాయం కోసం వారి బంధువులను తీసుకొని రావడానికి కొత్తబూరగపల్లి ఎస్టీ కాలనీకి వెళ్లి ఆమె కుమార్తె భువనేశ్వరి, అల్లుడు రమేష్ ను తీసుకొచ్చింది. అంతలో తన మనమరాలు ఏడ్చుకుంటూ వస్తుండగా ఏమైందని అడుగగా, తన తండ్రి పెద్దప్ప చేసిన దారుణ విషయాన్ని చెప్పింది. ఈ మేరకు పార్వతమ్మ పంజాణి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ కేసు విషయంపై స్పందించిన పలమనేరు రూరల్ సీఐ పరశురాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

ఏఆర్ అడిషనల్ ఎస్పిగా దేవదాస్

బాధ్యతలు చేపడుతున్న దేవదాస్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా అడిషనల్ ఎస్పిగా దేవదాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాస్ 1991 బ్యాచ్‌లో ఆర్ఎస్ఐగా పోలీసుశాఖలో చేరారు. మొదటి పోస్టింగ్‌లో చిత్తూరు ఏఆర్‌లో ఆర్ఎస్ఐగా పని చేసిన అనంతరం ఆర్ఐగా ఉద్యోగోన్నతి పొంది తిరుపతిలో పని చేసి, డిఎస్పిగా ఉద్యోగోన్నతి పొంది అనంతపురం ట్రైనింగ్ సెంటర్, పిటిసి కళ్యాణి డ్యాం, చిత్తూరులో పనిచేసి అడిషనల్ ఎస్పీగా 2022వ సంవత్సరంలో ఉద్యోగోన్నతి పొంది ఏపీపీఏలో పని చేస్తూ బదిలీపై చిత్తూరు జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీగా శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

రుణాలపై వడ్డీ మాఫీని వినియోగించుకోవాలి

\- ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా వారి ద్వారా 2015-16 నుండి 2018-19 సంవత్సరంలో మంజూరు చేసిన జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థిక, అభివృద్ధి సంస్థ, జాతీయ సఫాయి కర్మచారుల ఆర్థిక అభివృద్ధి సంస్థ రుణాలపై ప్రభుత్వం వడ్డీ మాఫీ అవకాశం కల్పించిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమ్ కుమార్ రెడ్డి, శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎన్ఎస్ఎఫ్‌డిసి కింద 576 మంది లబ్ధిదారులు, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి కింద 179 మంది లబ్ధిదారులు లబ్ధి పొందనున్నారని ఆయన తెలిపారు. నిర్ణీత గడువులోపు (ఏప్రిల్-2026) లోపు అసలు, రుణ మొత్తాన్ని చెల్లిస్తే 2025, ఆగస్టు 31వరకు ఉన్న మిగిలిన వడ్డీ మొత్తం మాఫీ చేస్తారని స్పష్టం చేశారు. కోవిడ్-19 తదితర కారణాల వల్ల రుణ వాయిదాలు చెల్లించలేని లబ్ధిదారులకు ఇది మంచి అవకాశమని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రుణాలను పూర్తిగా నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు. సంబంధిత లబ్ధిదారులు మరిన్ని వివరాల కోసం చిత్తూరు ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

గంజాయి మహమ్మారి నుండి

యువతను కాపాడుకుందాం..

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణలో ఆర్‌డివో పిలుపు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నగరి ఆర్‌డీవో అనుపమ

ప్రజాశక్తి- విజయపురం: 'గంజాయి మహమ్మారి నుండి యువతను కాపాడు కుందాం..' అని నగరి ఆర్‌డివో అనుమప పిలుపు నిచ్చారు. యుటిఎఫ్ 2026 డైరీ, క్యాలెండర్, జీఓ బుక్కులను నగరి ఆర్‌డివో శనివారం ఆవిష్కరించారు. ప్రస్తుత సమాజంలో ముఖ్య సమస్య అయిన గంజాయి, డ్రగ్స్ నుండి విద్యార్థు లను చైతన్య పరచడం కోసం సమాజం, తల్లిదండ్రుల బాధ్యత తెలిపేందుకు యుటిఎఫ్ సామాజిక స్పృహతో 'భావి భారత పౌరులను గంజాయి మహమ్మారి నుండి కాపాడుకుందాం..' అంటూ రూపొందించిన కరపత్రాలను ఆర్‌డివో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో యువత గంజాయి బారినపడి వారి భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నారని, యుటిఎఫ్ సామాజిక స్పృహతో ఇలాంటి చైతన్య కార్యక్రమాలను అవలంబించడం అభినందనీయమని ప్రశంసించారు. పోలీసుల సాయంతో అనేక కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులను, విద్యార్థులను చైతన్య పరచడంలో తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ మణిగండన్ , జిల్లా కార్యదర్శి కె వంశీకృష్ణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి రవీంద్రబాబు, జయరాజ్, నగరి మండల అధ్యక్షులు కెపి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, విజయపురం మండల అధ్యక్షులు సురేష్ బాబు, మండల సీనియర్ మునిరత్నం, కుప్పరాజు, యువరాజు, జనార్ధనన్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పీడీ తనిఖీలు

గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న కడ పీడీ వికాస్

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరమసముద్రం గురుకుల పాఠశాలలో కడ పీడీ వికాస్ మర్మత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల ఆవరణతో పాటు విద్యార్థులు ఉన్న హాస్టల్ గదులను ఆయన పరిశీలించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రస్తుతం కుప్పం ప్రాంతంలో చలి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో సోలార్ హాట్ వాటర్ సౌకర్యం కావాలంటూ విద్యార్థులు పీడీని కోరారు. మరుగుదొడ్లు, ఎలక్ట్రిక్ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. వీటితోపాటు గురుకుల పాఠశాల భవనాలకు రంగులు వేస్తే బాగుంటుందని పలువురు సిబ్బంది పీడీ దృష్టికి తీసుకువచ్చారు. గురుకుల పాఠశాలలోని తరగతి గదులను సైతం పిడి పరిశీలించారు. గురుకుల పాఠశాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులతో పాటు అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పీడీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు, ఏఇ శింబు, పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిత్తూరు పట్టణంలోని చర్చి వీధిలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ హెల్మెట్ ధారణ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణంలోని చర్చి వీధిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా తలకు గాయాల వల్ల ప్రాణనష్టం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని సూచించారు. హెల్మెట్ ధరించడం కేవలం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా కుటుంబ భద్రతకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి అంశాలపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణ నష్టం సంభవించే అవకాశాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

మహిళలకు మార్గదర్శి సావిత్రిబాయి పూలే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహిళలకు మార్గదర్శి సావిత్రిబాయి పూలే అని చిత్తూరు జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు తాళ్లపాక వరలక్ష్మమ్మ అన్నారు. శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్క రించుకొని పివికే ఎన్ డిగ్రీ కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చే సిన సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర, సేవలు, విద్యారంగంలో ఆమె అందించిన సేవలను తెలిపేలా ఈ కార్యక్రమం సాగింది. సభాధ్యక్షతను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి జీవనజ్యోతి, సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళల విద్యా ఉద్యమానికి పునాది వేశారన్నారు. మహిళల హక్కుల కోసం పోరాటం చేసి సామాజిక సమానత్వాన్ని సాధించడానికి కృషి చేశారని గుర్తు చేశారు. సావిత్రిబాయి పూలే మహిళల కోసం చేసిన పోరాటం ఈనాటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆమె చూపిన మార్గం ప్రతి విద్యార్థికి ఆచరణీయం అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నాగేంద్ర మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన జీవితాన్ని మహిళల విద్యా పురోగతికి అంకితం ఇచ్చి మహిళలను సమాజంలో ముందుకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు ఎస్ రెడ్డి బాష , డాక్టర్ జి రాజేష్ కుమార్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఏ నవనీత, డి చంద్ర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్‌సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: డిఆర్‌వో

పరీక్షల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డిఆర్‌వో మోహన్‌కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : డిపార్టుమెంటల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డిఆర్‌వో కె మోహన్ కుమార్ ఆదేశించారు. సోమవారం ప్రారంభం కానున్న శాఖా పరమైన పరీక్షలకు చేయాల్సిన ఏర్పాట్లపై శనివారం జిల్లా సచివాలయం డిఆర్ఓ ఛాంబర్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని డిఆర్ఓ తెలిపారు. ఏపీపీఎస్‌సి శాఖా పర పరీక్షలు ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి కెరీర్ అంశమని తెలిపారు. జిల్లాలో 4 పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు, ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలో) ఆర్‌విఎస్ నగర్ శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల పలమనేరులోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ సొసైటీ మురుకంబట్టు చిత్తూరు, కుప్పం ఇంజనీరింగ్ కళాశాల కుప్పం లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ వేళల్లో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఆన్ లైన్ ఉదయం మధ్యాహ్నం సెక్షన్‌కు 1797 మంది హాజరవుతారని, 318 మంది కన్వెన్షనల్ రాత పరీక్షకు హాజరవుతారని తెలిపారు. అభ్యర్థులు తమతో పాటు తప్పనిసరిగా ఒరిజనల్ గుర్తింపు కార్డును తీసుకురావాలని, లేదంటే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరని జిల్లా రెవెన్యూ శాఖ అధికారి తెలిపారు.రాత పరీక్షకు ఎపిపిఎస్‌సి నుంచి అనుమతి ఉన్న బేర్ యాక్ట్ పుస్తకాలను మాత్రమే తీసుకురావాలని, ఇతర పుస్తకాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఏవిధమైన ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, వీటిని అభ్యర్థులు తీసుకురావద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. లైజనింగ్ అధికారులు, ఛీఫ్ సూపరింటిండెంట్లు అప్రమత్తంగా ఉండాలని, ప్రశాంతంగా, సజావుగా పరీక్షలను పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు.ఈ సమావేశంలో పరీక్షల సెక్షన్ సూపరిండెంట్ , ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలి

సిడిపిఓలకు కలెక్టర్ ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిల్లల పోషణ, ఎదుగుదల, ఆరోగ్య ఫలితాలను మెరుగుపర చడానికి ఐసిడిఎస్ శాఖ అధికారులు , సిబ్బంది కృషి చేయాలని సిడిపిఓ, సూపరు వైజర్లను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో నాగార్జున వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల సంజీవని టిహెచ్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్, గ్రోత్ రిపోర్ట్ పోషన్ ట్రాకర్, పిఇఎస్ హాజరు, బిఎస్ కిట్, తదితర అంశాలపై సిడిపిఓలు, సూపరువైజర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో ఎక్కువ శాతం విద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ శాతం బడ్జెట్ కేటాయిస్తున్నారని, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలుసు కోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు ఎన్నో వేల కోట్ల రూపాయలతో పోషక విలువ లతో కూడిన ఆహార పదార్థాలు అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం వల్ల దేశాభివృద్ధికి ఎంతో ఉపయోగ కరంగా ఉంటుం దన్నారు. అన్ని ప్రాజెక్టులలో టిహెచ్‌ఆర్, డిస్ట్రిబ్యూషన్ వంద శాతం చేయాలని, అభయ ఐడి, ఎపిఎఆర్ ఐడి వందశాతం పూర్తి చేయాలని సూచించారు. ముస్తాబు అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లలు వంద శాతం హాజరు కావాలని, సిడిపివోలు, సూపరువైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లతో ప్రతిరోజూ అంగన్‌వాడీ విషయాలపై, మౌలిక వసతులపై చర్చించు కోవాలని ఆదేశించారు. బాల సంజీవని కిట్టు, బియ్యం, పప్పు నూనె, అన్ని ఇ పాస్‌లో తీసుకోవాలని సూచించారు. సిబ్బందికి శిక్షణ నిర్వహించాలని, ప్రోత్సాహకాలు అందిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో న్యూట్రిషన్ గార్డెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. ఐసిడిఎస్ సిబ్బంది కిట్స్ పంపిణీ చేయడం మాత్రమే కాకుండా ఫలితాల ఆధారిత పనితీరుపై దృష్టి సారించాలని కిట్స్ పంపిణీ తర్వాత హిమోగ్లోబిన్ గ్రోత్ విషయం తెలుసుకుని సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టుల భర్తీ నిర్వహించాలని పీడీని ఆదేశించారు. గర్భిణులలో హిమోగ్లోబిన్ తగ్గుదలలో కార్వేటినగరం, బైరెడ్డిపల్లి, పులిచెర్ల, కుప్పం, శాంతిపురం కేంద్రాలలో ఎక్కువగా ఉన్నాయని పురోగతి సాధించాలని అన్నారు. ఈ అంశంపై ఐసిడిఎస్ పీడీ ప్రతిరోజు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. అండర్ వెయిట్‌లో పలమనేరు, వికోట, చిత్తూరు అర్బన్ తదితర ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయని వాటిలో పురోగతి సాధించాలని అన్నారు. రాష్ట్రంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అన్నింటిలో మెరుగైన ఫలితాలు సాధించి, మెరుగైన స్థానాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

టీచర్లకు షోకాజ్‌లు కాదు.. స్వేచ్ఛనివ్వాలి: వైఎస్ఆర్‌టీఏ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ10వ తరగతి విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఎఫ్ఎల్ఎన్ వంద రోజుల ప్రణాళికలో మార్కులు నమోదు చేయలేదని అధికారులు టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం తగదని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి శేఖర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. విద్యాశాఖ అధికారులు టీచర్లకు స్వేచ్ఛ ఇవ్వకుండా ఉత్తీర్ణత శాతం పెంపు కోసం ఇబ్బంది పెట్టడం తగదన్నారు. పర్యవేక్షణ చేస్తున్న అధికారులు టీచర్లతో సన్నిహితంగా ఉంటూ వారికి మరింత స్వేచ్ఛనిస్తే ఫలితాలు ఆశాజనకంగా ఉంటా యన్నారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సరైన ఆహారం విశ్రాంతి, వినోదం అవసరమని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం విద్యా శాఖలో ఇతర శాఖ అధికారుల పెత్తనం ఎక్కువ కావడంతో ఉపాధ్యాయులు రగిలిపోతూ ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. సాంకేతిక సమస్యలు అధిగమించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తగిన కారణాలు తెలుసు కోకుండా ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి భయపెట్టిస్తున్నారని, అలా కాకుండా అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రిని డిమాండ్ చేశారు. షోకాజ్ నోటీసులు వెంటనే రద్దు చేయకపోతే వందరోజుల ప్రణాళికను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

వైకుంఠ దర్శనం..సామాన్యులకు దూరం..!

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

వైకుంఠ ద్వార దర్శనం ఏకాదశి రోజు క్రమేపీ సామాన్యులకు దూరమవుతుందనే చెప్పాలి.. తిరుమల తిరుపతి దేవస్థానం సంపన్నుల సేవలో తరిస్తూ, ధనికులకే దర్శనం కల్పించేలా వ్యవహరించారు. స్లాబ్లు, డిప్‌ల పేరుతో సామాన్యులను దేవునికి దూరం చేశారు. వైకుంఠ ద్వారాలు పది రోజులు తెరచే ఉంచి, నాలుగో రోజు నుంచి సామాన్యులకు దర్శన సౌకర్యం ఉంటుందని ఎంచక్కా ప్రకటించారు. ఏకాదశి రోజు శ్రీవారి దర్శనం చేసుకున్న భక్తులతో 'ఆహా, ఓహో' అంటూ భజన చేయించారన్న విమర్శలు లేకపోలేదు.

తిరుపతి, తిరుమల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం. శ్రీవారి బ్రహ్మోత్సవాల తర్వాత ప్రాముఖ్యత గలది వైకుంఠ ఏకాదశి దర్శనం. తిరుమల శ్రీవారి ఆలయంలో ఉత్తర ద్వారాలు ఏడాదికి ఒక్కసారి మాత్రమే తెరుస్తారు. వైకుంఠ ఏకాదశి ద్వాదశి రెండు రోజులు మాత్రమే గతంలో ఆ ద్వారాల్లో ప్రవేశానికి అనుమతించేవారు. ఈ రెండు రోజుల్లో సుమారు మూడు లక్షల మందికి పైగా భక్తులు స్వామివారి దర్శనానికి క్యూ కట్టేవారు. ఈ రద్దీని తగ్గించేందుకు గత ప్రభుత్వ హయాంలో పది రోజులు పాటు ఉత్తరద్వారాలు తెరిచి ఉండేలా నిర్ణయం చేశారు. ఇందులో స్థానికులకు సైతం ప్రత్యేక అవకాశం కల్పించారు. 2024లో వైకుంఠ ఏకాదశి టోకెన్లు జారీ సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతిచెందారు. ఈ విషాదకర ఘటన శ్రీవారి భక్తులకు విస్మయానికి గురిచేసింది.

ఈ ఏడాది స్థానికులకు దర్శనాలను నిలిపివేసి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వారందరూ స్థానికులు ఆన్లైన్ ద్వారా శ్రీవారి దర్శనాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చింది. పైగా డిప్‌లు ఏర్పాటు చేసింది. టీటీడీ నిర్వహించే డిప్పులో ఎవరైతే ఎంపిక అవుతారో వారికే దర్శనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో చదువు రాని వారు, ఇంటర్నెట్ అందుబాటులో లేనివారు, గ్రామీణ ప్రాంత వారు దర్శనానికి దూరమయ్యారు. ఎలాగోలా టోకెన్లు సంపాదించుకున్నా, టీటీడీ డిప్లో పేర్లు రాకపోవడంతో అధికమంది దర్శనానికి నోచుకోలేదు. వృద్ధులు, మహిళలు ఎంతో ఆశతో ఎదురుచూసిన వైకుంఠ ద్వార దర్శనాలకు ఈ ఏడాది దూరం కావడంతో నిరుత్సాహం చెందారు. పైగా సర్వదర్శనాలు మూడు రోజులు పాటు రద్దు చేశారు. దీంతో దర్శన టోకెన్ ఉంటేనే కొండకి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. భక్తులను టోకన్లతో సంబంధం లేకుండా కొండకు అనుమతిస్తే, స్వామివారి దర్శనం లేకుండా అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టుకొని, స్వామివారికి బయటి నుంచి దండం పెట్టుకొని, సంతప్తి పడే వారమని భక్తులు బాధపడడం గమనార్హం. అనుభవజ్ఞులైన నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, ఇద్దరు ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలోని పరిపాలన విభాగం, సీనియర్ రాజకీయ నాయకులు, ఉద్దండులతో మమేకమైన టిటిడి పాలకమండలి ఉండి కూడా ప్రత్యేక దినాలలో సర్వదర్శనాన్ని కల్పించలేకపోవడం శోచనీయం. పైగా వైకుంఠ ఏకాదశి రోజే సుమారు పది గంటలు పైగా వివిఐపిల సేవలో తరించడం బాధాకరం. డిసెంబర్ 30వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు శ్రీవారిఉత్తర ద్వారాలు తెరిచి వీఐపీలను దర్శనానికి అనుమతించారు. విఐపిల దర్శనాలే ఉదయం 10.30 వరకు కొనసాగింది అంటే సుమారు 10:30 గంటల పాటు వారి సేవలో టీటీడీ పాలకమండలి తరించింది. టైం స్లాబులు ప్రకారం సామాన్యులను ఉదయం 10 గంటల తర్వాత దర్శనానికి అనుమతించారు. క్యూలైన్లో సెల్ ఫోన్లను భద్రపరిచేందుకే భక్తులకు గంటకు పైగా సమయం పట్టిందంటే, సామాన్యులకు టీటీడీ కల్పిస్తున్న సౌకర్యం ఎలా ఉందో అర్థమవుతుంది. భక్తుల నియంత్రణ పేరుతో క్యూ

లైన్ లలో, స్వామి వారి ఆలయంలో టీటీడీ సిబ్బంది, సేవకులే అధికంగా కనిపించడం గమనార్హం. సాధారణ రోజుల్లోనే 70 నుంచి 80 వేల మందికి దర్శనం కల్పిస్తున్న టీటీడీ, ప్రత్యేక దినాలలో కనీసం 70వేల మందికి కూడా దర్శనం కల్పించకపోవడం విడ్డూరంగా ఉంది. వైకుంఠ ఏకాదశి రోజు 67 వేల మంది, ద్వాదశి రోజు 70 వేల మంది, జనవరి ఒకటవ తేదీ 60 వేల మంది భక్తులకు దర్శనభాగ్యం కల్పించినట్లు సాక్షాత్తు టిటిడి అధికారులు ప్రకటించారు. రోజుకు 90 వేల నుంచి లక్ష మంది వరకు దర్శనాలు కల్పిస్తామని టీటీడీ అధికారులు పాలకమండలి ప్రకటించిన నిర్ణయాలు ఏమయ్యాయో వారి చిత్తశుద్ధికే వదిలేద్దాం. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, జనవరి ఫస్ట్, మూడు రోజులు తర్వాత వీఐపీల తాకిడి తగ్గడంతో రెండవ తేదీ మాత్రం 83 వేల మంది భక్తులకు దర్శనం కల్పించామని టీటీడీ నే ప్రకటించింది. అంటే ఆ మూడు రోజులు రోజుకు 30 వేల మందికి పైగా విఐపీల సేవలో తరించామని అంగీకరించినట్టే. తిరుమల చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ప్రత్యేక దినాలలో శ్రీవారి దర్శనానికి సామాన్యులను దూరం చేయడం (సర్వదర్శనం నిలిపివేయడం) ఈ ఏడాది తొలిసారి.

మహిళలకు మార్గదర్శి సావిత్రిబాయి పూలే

ప్రజాశక్తి - వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద అధ్యక్షతన శనివారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రతి విద్యార్థిని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం సభ్యులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు కళాశాల అభివృద్ధిలో మహిళా టీచర్ల భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విధుల్లో ప్రతిభ చూపిన మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురం: స్థానిక మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు ప్రసంగించారు. ఆదర్శ ఉపాధ్యాయురాలు సూరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సుజాత లను పేరెంట్స్ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పుంగనూరు: భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా స్త్రీ, విద్య, సామాజిక ఉద్యమకారిణిగా సావిత్రిబాయి పూలే కలిసి నడిచారని మండల తహశీల్దార్ రాము, అర్బన్ సీఐ సుబ్బరాయుడు అన్నారు. స్థానిక ఇందిరా సర్కిల్లో బీసీ సంక్షేమ సంఘం తమ్మిరెడ్డిపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల ఎదగాలని సూచించారు. జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గంపల గంగరాజు, బీసీ సంఘ మహిళా నేతలు పాల్గొన్నారు.

కార్వేటినగరం: స్త్రీ విద్య సాధికారత కోసం జీవితాన్ని త్యాగం చేసిన సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శనీయమని డీఎంపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం నాథమునిరెడ్డి అన్నారు. శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవాన్ని డీఎంపురం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులైన సరస్వతి, కళావాణి,మాలతి, సుమతి, కేఎం పురం ఆదర్శ పాఠశాలకు చెందిన తులసి, రాణిజయసుధ, ఆర్ తులసిలను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కెఎంపురం ఆదర్శ పాఠశాల హెచ్ఎం చలపతిరావు, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మహిళ ఉపాధ్యాయులు అందరూ సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడవాలని రొంపిచర్ల ఎంఈఓ డి శ్రీనివాసులు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందరరేగా శనివారం రొంపిచర్ల బాలుర ఉన్నత పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, అమర నాయక్, నాగరాజా, రఫీ భాష, లాల్ షా, విజయలక్ష్మి, లీలావతి, కళ్యాణి, లక్ష్మి, మహేష్ బాబు, రెడ్డయ్య, శ్రీనివాసులు, దేవకి, యశోద, కేశవులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు ప్రభుత్వ స్థానిక ఎస్‌వీసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాలలో శనివారం సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు నందీశ్వరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డా నందీశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న రోజుల్లో ఒక స్త్రీ అనేక రకాలుగా ఇబ్బందులను ఎదుర్కొని ఉపాధ్యాయ వృత్తిని ' చేపట్టిన గొప్ప సంఘసంస్కర్త, మానవ తావాది, సమ సమాజ నిర్మాణం కోసం పాటు పడిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టరు జయశంకర్, డాక్టరు షేక్ బెనజీర్, తదితరులు పాల్గొన్నారు.

యాదమరిలో

యాదమరి: యాదమరి మండలంలో కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి సహాయ సహకారంతో మహిళ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ ఎపిలలిత తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ ముఖ్య కారకులైన కనకాచారికి, అతనికి సహకారం అందించిన భాస్కర్ రెడ్డికి మహిళ ఉపాధ్యాయుల తరపున మహిళలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళ ఉపాధ్యక్షులు జె హిమబిందు, షహనజ్, ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో 30 మంది మహిళలకు శాలువా కప్పి, పండు, పసుపు, కుంకుమ, గాజులు , గిఫ్ట్ ఇచ్చి సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమం మండల పిఆర్‌టియు అధ్యక్ష , ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, సురేష్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్ హరికృష్ణ, హైస్కూల్ కార్యదర్శి ఆషా, సిపియస్ కన్వీనర్ కె భారతి, ఎ రేఖారాణి, సోదర సంఘ జిల్లా అధ్యక్షులు మధన్ మోహన్ రెడ్డి దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

పలమనేరు: దేశంలో ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేనని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి . మునిరత్నం పేర్కొన్నారు . అందులో భాగంగా పలమనేర్ పట్టణంలోని జాతీయ మానవ హక్కుల కార్యాలయంలో మహిళా అధ్యక్షురాలు వాణి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే 159వ జయంతిని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వరీ,శాంతమ్మ,కుమారి,శివా మాస్టర్,మంజునాథ్, అమానుల్లా, అనమప్ప,శంకరప్ప,చాన్ బాషా పాల్గొన్నారు.

రామకుప్పం: సావిత్రిబాయి పూలే 195వ జయంతిని శనివారం రామకుప్పం లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి బీసీ నాయకులు, బహుజనులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ, బహుజన నేతలు అమర్నాథ్ శెట్టి,సతీష్,బీడా సుబ్రహ్మణ్యం, శంకర్, మంజునాథ్, మునిరత్నం, నాగరాజు, బాబు,బాలి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: ఎంవిఐ

ప్రజాశక్తి -పుంగనూరు: రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సుప్రియ కోరారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం వారి కార్యాలయం వద్ద ఏఎంవిఐ హరికిషోర్ తో కలిసి డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ప్రతి ఏడాది అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారుల నిర్లక్ష్యంతో రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, వాహనాలను జాగ్రత్తగా నడుపుతూ, ఎదురుగా వచ్చే వారిని, రోడ్డుపై నడిచివెళ్లే వారిని గమనించాలని కోరారు. మద్యం తాగి నడపరాదని, సెల్‌ఫోన్లకు బ్లూటూత్ పెట్టి నడపడం చేయరాదన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ఖచ్చితంగా ధరించి నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని కోరారు. రికార్డులు లేకపోతే భీమా రాదని, యజమానులే సొంత డబ్బులు బాధితులకు చెల్లించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు.

మానసిక పరిస్థితి బాగోలేని వృద్ధురాలిని ఇంటికి చేర్చిన పోలీసులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : మానసిక ఆరోగ్యం సరిగా లేకుండా చిత్తూరుకు వచ్చిన ఒక వృద్ధ మహిళను వారి పిల్లల చెంతకు పోలీసులు చేర్చారు. కర్నూల్ ఆర్యా నగర్ కు చెందిన ఒక వృద్ధ మహిళ మానసిక ఆరోగ్యం బాగోలేక చిత్తూరు పట్టణానికి వచ్చి పలు ప్రాంతాలలో సంచరిస్తూ ఉండగా మహిళా పోలీసులు ఆమెను చేరదీసి పట్టణంలోని అమ్మఒడి ఆశ్రమంలో చేర్పించారు. ఆమె వివరాలను సేకరించి ఇంటి చిరునామా ఖరారు చేశారు. ఆమె కుటుంబ సభ్యులను చిత్తూరుకు పిలిపించి, అవసరమైన పత్రాల పరిశీలన అనంతరం సురక్షితంగా వారి చెంతకు అప్పగించారు. తమ తల్లిని సురక్షితంగా కనిపెట్టి బాధ్యతతో అప్పగించిన చిత్తూరు జిల్లా పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి వృద్ధులు, నిరాధారులు, మానసిక ఒత్తిడితో బయట తిరిగే వ్యక్తులను ఆదుకుని, సమయానికి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడంలో చూపిన స్పందన, సేవాభావాన్ని అభినందిస్తూ పోలీస్ అధికారులను, సిబ్బందిని ప్రశంసించారు.

నాగవేణికి సావిత్రిబాయి పూలే అవార్డు

ప్రజాశక్తి - పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న నాగవేణి సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నట్లు తెలిపారు. క్రమశిక్షణ అంకితభావంతో పనిచేస్తూ బోధనలో వినుత ప్రతిభ కనబరిచినందుకు శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డు తీసుకున్నారని ఉపాధ్యాయురాలు నాగవేణి ప్రజాశక్తికి తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలి: ఎంపీడీఓ

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండలంలోని అన్ని గ్రామాల్లో నిరంతర పారిశుధ్య పనులను చేపట్టాలని ఎంపీడీవో బాలాజీ పంచాయతీ అధికారులను ఆదేశించారు.శనివారం మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో,సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో అపరిశుభ్రత కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీనిని నివారించడానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.మురుగు కాలువల శుభ్రత,అన్ని గ్రామాల్లో మురుగు కాలవులు ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టి,మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. బ్లీచింగ్, క్లోరినేషన్, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా బ్లీచింగ్ చల్లించాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి, త్రాగునీటిలో క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ పకడ్బందీగా సేకరించి, డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలు, డ్రైనేజీ మరమ్మతులను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, మండల గ్రామ వార్డు సచివాలయ అధికారి జాకీర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండలంలోని పెద్ద వెలగటూరు పంచాయతీ గ్రామాలలో శనివారం భూమి పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు తహశీల్దారు హనుమంతు తెలిపారు. గత ప్రభుత్వంలో రీ సర్వే జరిగిన పంచాయతీల్లో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో కూడా పంపిణీ చేయునట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, సింగిల్ విండ ప్రెసిడెంట్ శ్రీరాములు, టిడిపి యూత్ నాయకులు నాగరాజు రెడ్డి,సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, టిడిపి నాయకులు జయరాం రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-తవణంపల్లి:

తవణంపల్లి మండలం అరగొండలోని అరగొండ అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పౌర్ణమి సందర్భంగా ఉదయం 11 గంటలకు సుదర్శన హోమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం హరికథలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుషార్ డీడీ, ట్రైనింగ్ ఎస్పీ తరుణ్ యాదగిరి హాజరై, శ్రీ వీరాంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆయనకు ఆలయ మర్యాదలతో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పౌర్ణమి వేడుకల్లో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, ఆలయ సిబ్బంది చురుకుగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

భక్తులకు అన్న ప్రసాద వితరణ

ప్రజాశక్తి -సోమల:

మండల కేంద్రమైన సోమల సమీపంలోని బంగారు తిరుత్తని గిరి ప్రదక్షిణ శనివారం పౌర్ణమి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరు కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లి ప్రదక్షిణ చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భూదేవీ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులకు స్వామివారి దర్శనం తదనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. భజనలు కోలాటాలతో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కలెక్టర్ ఆదేశాల మేరకు వెదురుకుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పురుషోత్తం ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ అభివృద్ధి అధికారులు, సంక్షేమ సహాయకులు, డిజిటల్ సహాయకులు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఏకీకృత కుటుంబ సర్వే, అప్‌డేట్ ఇక్వెసిస్, సంజీవని సర్వే, స్వామిత్వ సర్వే, ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సూచనలు ఇచ్చారు. వెదురుకుప్పం గ్రామ పంచాయతీలో జరుగుతున్న స్వచ్ఛ సంక్రాంతి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం అని ఎంపీడీఓ సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మాధవి, జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీఓ నిరంజన్ రెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారులు, సంక్షేమ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీ

ప్రజాశక్తి -యాదమరి : యాదమరి మండలంలోని కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్, పి.గొల్లపల్లె హైస్కూల్ లను శనివారం ఉదయం 8.15 గంటలకే చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ ఆకస్మిక తనిఖీలు చేశారు. పదవ తరగతి వంద రోజుల కార్యక్రమాన్ని, రోజువారి ప్రశ్న, జవాబు పత్రాలను పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలో జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలోని కృత్యాలను, డైరీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు హెచ్‌యం ఎపి లలిత తెలిపారు. ఆయన వెంట ఎంఇఒ హెచ్ఎల్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఇఒ విద్యాభివృద్ధికి సలహాలు, సూచలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకయ్యాచారి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు మదన్మోహన్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల అసోసియేషన్ క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - రొంపిచెర్ల : రాష్ట్ర వీఆర్ఏ అసోసియేషన్ క్యాలెండర్లను రొంపిచెర్ల మండల తహశీల్దారు కిరణ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలు అందరూ కలిసి తహశీల్దారుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మణ, వైస్ ప్రెసిడెంట్ ఎస్ ఇర్ఫాన్ అలీ మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు నరేష్, దామోదర్, మల్లిక, నజీర్, వాసు, శివ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా బడికి రావాలి: ఎంఈవో

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని నల్లంగాడు ఎస్టీ కాలనీలో సందర్శించి బడికి రాని పిల్లలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వెచ్చించి విద్యను అందిస్తున్నదని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోరుకుని ప్రభుత్వ పాఠశాలను స్థానిక గ్రామాల్లో ఏర్పాటు చేశారని ప్రతి ఒక్కరూ సమీపంలోని పాఠశాలలో విద్యనభ్యసించి విద్యావంతులుగా కావాలనేదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపి సహకరించాలని పాఠశాలకు రానిపక్షంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర్ రెడ్డి పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి -బంగారుపాలెం: ఓం శక్తి భక్తులు శుక్రవారం అన్నదానం చేశారు. మండలంలోని తగువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో గురుశక్తి సౌందర్యమ ఆధ్వర్యంలో ప్రేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురు శక్తులు జయమ్మ, వసంతమ్మ, కాంచన, లక్ష్మి, కస్తూరి , రుక్మిణి, మల్లిక, పలువురు ఓం శక్తి మాల ధారణ మహిళలు పాల్గొన్నారు .

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో శనివారం మండల అయ్యప్పస్వామి భక్తుల భజన మండలి బృందం అన్నదానం నిర్వహించారు. గత ఏడు వారాలుగా అన్నదానం చేశామని ఇందుకు సహకరించిన అయ్యప్ప భక్తులకు, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్‌డీవోకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి -కార్వేటినగరం : నగరి ఆర్డీవో అనుపమ ను శనివారం మండల టిడిపి అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి విఎం రాజా కలిసి శాలూవా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా, పలువురు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని తీర్ధం పంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు తీర్ధం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య ఆవగాహన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ ఈ ఓ కాంతమ్మ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ పై అవగాహన కలిగి వుండాలని, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని,మంచి పోషక ఆహారం తినాలని, యెగా, మెడిటేషన్ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీపతి ఉపాధ్యాయులు , విద్యార్థులు ఆశా శాంతమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి: టిడిపి

ప్రజాశక్తి - రొంపిచెర్ల : ప్రత్యేక ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ చిత్తూరు జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షులు ఇర్షాద్ తెలిపారు. శనివారం రొంపిచెర్ల మండలంలో ప్రత్యేక ప్రతిభావంతులకు సొంత ఖర్చులతో వినికిడి యంత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇప్పటికే దివ్యాంగులకు వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్స్, వాకర్లు, వినికిడి యంత్రాలను అందించారు. ఇంకా ఎవరికైనా అవసరమైతే తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు ఎస్ మహమ్మదలీ, రొంపిచెర్ల మండల అధ్యక్షులు అబ్దుల్ రెహ్మాన్, పులిచెర్ల మండల అధ్యక్షులు రెడ్డి శేఖర్ నాయుడు ఉపాధ్యక్షులు రాజేష్, అడ్వైజర్ ఢిల్లీ బాబు, దివ్యాంగుల సంఘం నాయకులు మహ్మద్ అనీఫ్ పాల్గొన్నారు.

వివాదాలు లేకుండా భూ రీసర్వే: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వివాదాలు లేకుండా భూ రీసర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ సూచించారు. గుడిపాల మండలం మొగరాలపల్లి, పెయనపల్లి రెవెన్యూ గ్రామాలలో శనివారం నిర్వహించిన 'రీ సర్వే', పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతలు, తండ్రులు వారసత్వంగా ఇచ్చిన, కష్టపడి సంపాదించిన భూముల పాస్ పుస్తకాల్లో గత వైసీపీ పాలకులు వారి ఫొటోలు వేసుకోవడం ఎంతవరకు న్యాయమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రైతుల మనోభావాలను తెలుసుకొని, వారికి మనశ్శాంతి కల్పించడం కోసమే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల పట్టా పాస్ పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రికతో అందిస్తున్నట్లు చెప్పారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇచ్చిన పాస్ పుస్తకాల్లో తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, క్షేత్ర స్థాయిలో ఇంకా భూ సమస్యలు ఉన్నాయని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. రీ సర్వే నిర్వహించే సమయంలో స్థానిక రైతులు, నాయకులను సమన్వయం చేసుకొని వివాదాలకు తావు లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ పలువురు రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, తహశీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో శిరీష, స్థానిక సర్పంచ్ సంగీత, ఎంపిటీసీ, హరి, జయదేవ నాయుడు, మాజీ జెడ్పిటీసీ బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కుప్పం: జనవరి 9వ తేదీ వరకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు అందిస్తామని కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. కుప్పం మండలం గుండ్ల కదిరేపల్లి, వసనాడు గొల్లపల్లి, బోధ గుట్టపల్లిలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. రీసర్వేలోని లోపాలను సరిదిద్ది, భూ యజమానులకు పూర్తి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందుకోవడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్,మండల అధ్యక్షుడు రాజగోపాల్,నడుమూరు సర్పంచ్ సంతోష్, వెండుగం పల్లి మాజీ సర్పంచ్ రమేష్, కార్పొరేషన్ డైరెక్టర్ శరవణ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ సెమీ పతి కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గాజుల రామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సంక్రాంతి లోపు ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరువేయడంలో అధికారులు ముందుం డాలన్నారు. అధికారులు ప్రజలకు బాధ్యులుగా పనిచేసి మంచి పేరు తేవాలన్నారు. జడ్పిటిసి దామోదర్ రాజు వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి పలు అంశాలపై అధికారులను ప్రశ్నించి వాటిని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లీలా మాధవి , సర్పంచుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి సింగల్ విండో చైర్మన్ పగడాల హరిప్రసాద్ రాయల్, వైస్ చైర్మన్ నరసింహులు యాదవ్ , అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

ఏపీ సిపిఎస్ఈఏ మండల అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఏపీ సిపిఎస్ఈఏ మండల నూతన అధ్యక్షులుగా ఎస్ రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకోగా అందరు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా చెన్నకేశవులు కోశాధికారిగా ఇమ్రాన్ గౌరవ అధ్యక్షులుగా మీ సురేష్ బాబు మండల ఉపాధ్యక్షులుగా ఏ ప ృద్వీ మండల అదనపు ప్రధాన కార్యదర్శిగా బి ఎం వసంత కుమార్ స్టేట్ కౌన్సిలర్లుగా ఇద్దరు జిల్లా కౌన్సిలర్లు నలుగురు మండల కార్యదర్శి ఐదుగురు ఎన్నికైనట్టు రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సిపిఎస్

అధ్యక్షులుగా రమణయ్య

రద్దుచేసి ఓపిఎస్ అమలు పరచా లని పెండిం గ్లో ఉన్న మూడు డిఏలు వెంటనే విడుదల చేయా లని పిఆర్సి కమిటీ ప్రకటించి ఐ ఆర్ ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని సిపిఎస్ రద్దు కోసం ఎలాంటి పోరాటాల కైనా ఆందోళనలకైనా సిద్ధంగా ఉంటామని ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు.

చేపల చెరువుల వేలం పాట

రెండు పంచాయతీలకు ఆదాయం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం లోని పేటూరు, అన్నెమ్మ గారి పల్లి పంచాయతీల పరిధిలోని చేపల చెరువుల వేలం పాటలు శనివారం నిర్వహించగా రెండు పంచాయతీలకు మంచి ఆదాయం లభించినట్లు పంచాయతీ కార్యదర్శులు జగదీష్, హరీష్ కుమార్ రెడ్డి తెలిపారు. పేటూరు పంచాయతీ కొత్తచెరువుకు రూ, 6,900, పత్తికొండ చెరువుకు రూ.3100, బోన మంద చెరువుకు రూ.4000, రెడ్డి చెరువు ఒడుకు రూ.4600, వెంకటప్ప చెరువుకు 5000 రూపాయలకు వేలం పాటలు జరిగాయని మొత్తం 23,600 రూపాయల ఆదాయం లభించినట్లు కార్యదర్శి తెలిపారు. అన్నెమ్మ గారి పల్లి పంచాయతీ పరిధిలోని ధోని మాకుల చెరువు18,000 గడ్డ మాను వొడ్డు 6000, ఎగువ చెరువు 12000 నాగమ్మ చెరువు 4000 రూపాయలకు వేలం పాటలలో హెచ్చు పాటదారులు దక్కించుకున్నారని మొత్తం 40 వేల రూపాయల ఆదాయం లభించినట్టు కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ,గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:

బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తామని సమస్త సహాయక మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. వివిధ రకాలైనటువంటి శారీరక రుగ్మతలకు పరీక్షలు జరిపి, చికిత్స నిమిత్తం కుప్పం పి ఇ ఎస్ ఆసుపత్రికి తరలించే క్రమంలో చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి పి ఇ ఎస్ కుప్పం హాస్పిటల్ వారు తమ వైద్య సిబ్బందితో పరీక్షలు జరపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహతి ఫౌండేషన్ వారు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రోగులను తరలించడానికి బస్సుల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని నేడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

రోడ్డును కమ్మేసిన పొగమంచు..

వాహనదారులకు ఇబ్బందికర వాతావరణం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రం నుంచి పుంగనూరు వైపు వెళ్లే జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజాము నుండి ఉదయం 7:45 గంట సమయం అవుతున్నా దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందున్న వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, లారీలు నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల దూరం పూర్తిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వేళల్లో రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉండటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఈ పొగమంచు కారణంగా ప్రయాణం అతి కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అప్రమత్తమై రహదారిపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గొల్లపల్లి భూమి విషయంలో మా ప్రమేయం లేదు..

- దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు
- టిడిపి నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ పరిధిలోని గొల్లపల్లికి సమీపంలో భూములకు సంబంధించి కొన్ని మీడియా, పత్రికలలో టిడిపి నేతలు డబ్బులు తీసుకున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని ఇది సమంజసం కాదని నిజా నిజాలు తెలుసుకొని వార్తలు ప్రచురిం చాలని మండల టిడిపి అధ్యక్షులు స్వామిదాస్ అన్నారు. ఈ సందర్భంగా స్వామిదాస్ మాట్లాడుతూ కొంతమంది కావాలనే టిడిపి ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఇది సమంజసం కాదన్నారు. అనంతరం పెనుమూరు మార్కెట్ కమిటీ అధ్యక్షులు కృష్ణమ నాయుడు మాట్లాడుతూ భూములకు సంబంధించి తన పాత్ర ఏమాత్రం ఉన్నట్లు సాక్ష్యాలతో తేలినా అందుకు టిడిపి ప్రభుత్వం

తీసుకునే చర్యలకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. అనవసరంగా తనపై దుష్ప్రచారం చేస్తు న్న వారిపై న్యాయస్థానం ఆశ్రయించి పరువు నష్టం దావా కేసు వేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సందర్భంగా జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ తన తండ్రి తన కుటుంబం టిడిపి సానుభూతి పరులమని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు టిడిపి తనకు ఎన్నో అవకాశాలు కల్పించిందని తాను పార్టీకి చెడ్డ పేరు తీసుకువచ్చే ఎలాంటి పనులు తాను చేయలేదన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు నిజం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మోహన్ నాయుడు, టీడీపీ నేత పురుషోత్తమ నాయుడు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన రాజముద్రతో ఈ పాస్ బుక్ లను రైతులకు అందించడమే కాక అధికారం చేపట్టిన మొదటి సంతకమే రైతులకు ఈ పాస్ బుక్ అందించడయే రాష్ట్ర ముఖ్యమంత్రి ద్యేయం అని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ అన్నారు ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు పట్టాదారుపాస్ పుస్తకాలపై తన బొమ్మ ముద్రించుకుని షో రాజకీయం చేశాడని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల పట్టాదారు పాసు పుస్తకాలపై రాజముద్రం ముద్రించి పట్టాదారు పాసుపుస్తకాలును పంపిణీ చేశాడని గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ అన్నారు. స్థానిక తాహసిల్దార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం థామస్ శనివారం మండలంలోని ముద్ది కుప్పం రైతు సేవ కేంద్రంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు చేసిన దగాను వివరించారు. ఉచితంగా పంపిణీ చేసే గ్యాస్ సిలిండర్ లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకనాథపిళ్ళై, టిడిపి మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ,రాష్ట్ర నాయకులు బాలాజీ నాయుడు , జిల్లా నాయకులు రాజశేఖర్ నాయుడు, మాజీ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుంన్నదని

పీకే ఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన రామకుప్పం మండల పరిధిలోని పలు పంచాయతీలలో రైతులకు భూ హక్కు నూతన పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కౌలేష్, ఎంపిపి సులోచన గుర్రప్ప, టిడిపి నేతలు మునస్వామి, పత్రా నారాయణ, వెంకటరమణ,ఆనంద్ రెడ్డి, కామరాజ్ నాయక్,రఘు, రామ్మూర్తి, కన్నన్, రఫీ, రవి రెడ్డి,బాలు, భాస్కర్, శుభాష్ రెడ్డి,రామకుప్పం మండల టిడిపి నేతలు,పెద్ద ఎత్తున రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కుప్పం: నిజనవరి 9వ తేదీ వరకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు అందజేయడం జరుగుతుందని కడ పిడి వికాస్ మర్మత్ తెలిపారు. కుప్పం మండలం గుండ్ల కదిరేపల్లి, వసనాడు గొల్లపల్లి, బోధ గుట్టపల్లిలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. రీ-సర్వేలోని లోపాలను సరిదిద్ది, భూ యజమానులకు పూర్తి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మండల అధ్యక్షుడు రాజగోపాల్, నడుమూరు సర్పంచ్ సంతోష్, వెండుగం పల్లి మాజీ సర్పంచ్ రమేష్, కార్పొరేషన్ డైరెక్టర్ శరవణ పాల్గొన్నారు.